వికారాబాద్ కలెక్టర్‌పై దాడిని ఖండిస్తున్నాం..

మాట్లాడుతున్న టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి

కామారెడ్డి, నవంబర్ 12 : వికారాబాద్ కలెక్టర్, ప్రత్యేక అధికారిణి, ఇతర ఉద్యోగులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగులపై దాడికి పాల్పడడం విచారకరమని అన్నారు. దాడికి పాల్పడిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ కార్యదర్శి సాయిలు, అసోసియేట్ అధ్యక్షుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సాయికిరణ్ సదానంద్‌కు కాళోజీ పురస్కారం

కాళోజీ పురస్కారం అందుకుంటున్న సాయికిరణ్ సదానంద్

కామారెడ్డి, నవంబర్ 12 : కామారెడ్డి జిల్లాకు చెందిన సాయికిరణ్ సదానంద్‌కు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో భారత్ కల్చరర్ అకాడమీ, టెలివిజన్ రచయితల సంఘం సంయుక్తంగా నిర్వహించిన కాళోజీ స్మారక జాతీయ స్థాయి కవిత పోటీల్లో కవితా గానం చేశారు. అనంతరం సాయికిరణ్‌కు ప్రముఖ టీవీ నటుడు, రచయిత నాగబాల సురేశ్ కుమార్, పాటల రచయిత మౌనశ్రీ మల్లిక్, దర్శక, నిర్మాత ప్రభాకర్ చేతుల మీదుగా కాళోజీ ప్రతిభా పురస్కారం, ప్రశంసాపత్రాలను మంగళవారం అందుకున్నారు. పలువురు ఆయనను అభినందించారు.

వ్యవసాయాధికారిణిగా శ్రుతి

శ్రుతి

రాజంపేట్, నవంబర్ 12 : మండల వ్యవసాయాధికారిణిగా శ్రుతి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రైతు వేదికలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి మంగళవారం నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతులు పాల్గొని పంట సమస్యలను తెలియజేయాలన్నారు. శాస్త్రవేత్తలు సలహాలు, సూచనలు ఇస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవోలు శిల్ప, శ్రీకాంత్, రజిత, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు ఎన్యుమరేటర్లను నియమించుకోవాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కామారెడ్డి, నవంబర్ 12 : ప్రభుత్వ ఆదేశాలననుసరించి అవసరమైన పక్షంలో నిబంధనల మేరకు ఎన్యుమరేటర్లను నియమించుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవో, మండల ప్రత్యేకాధికారులతో ఇంటింటి సమగ్ర సర్వేపై మండలాల వారీగా మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఎన్యుమరేటర్ రోజుకూ 15 నుంచి 20 వరకు ఇండ్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలన్నారు. మున్సిపల్ ఏరియాలో కూడా ఎన్యుమరేషన్ వేగవంతం చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విట్టల్, ఆర్డీవో రంగనాథ్ రావు, సీపీవో రాజారాం, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

తిప్పాపూర్‌లో పశువైద్య శిబిరం

పరీక్ష చేస్తున్న పశువైద్య సిబ్బంది

భిక్కనూరు, నవంబర్ 12 : మండలంలోని తిప్పాపూర్‌లో మంగళవారం పశువైద్య శిబిరం నిర్వహించారు. ఆవులు, గేదెలకు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి దేవేందర్ తెలిపారు. కార్యక్రమంలో పాల కేంద్రం అధ్యక్షుడు కుంట లింగారెడ్డి, పశు వైద్య సిబ్బంది, పాడి రైతులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ అందజేత

బాధితుడికి ఫోన్ అందజేస్తున్న ఎస్సై

మాచారెడ్డి, నవంబర్ 12 : పాల్వంచ మండలంలోని భవానీపేట గ్రామానికి చెందిన రాజేశ్వర్‌రెడ్డి ఇటీవల ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు వెంటనే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై అనిల్ సీఈఐఆర్ ద్వారా ట్రేస్ చేసి ఫోన్‌ను బాధితుడికి మంగళవారం అందజేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నవారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

పద్మశాలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గంగాధర్

బాన్సువాడ టౌన్, నవంబర్ 12 : బాన్సువాడ పద్మశాలీ సంఘ సభ్యుడు గంగాధర్ రాష్ట్ర పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ఒక మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాన్సువాడ పట్టణ పరిధిలోని ప్రజాప్రతినిధులు, నాయకులు గంగాధర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలి

క్రీడాకారిణులతో కలిసి వాలీబాల్ ఆడుతున్న రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అలుగు వర్షిని

బాన్సువాడ రూరల్, నవంబర్ 12 : క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని, ప్రతి క్రీడాకారిణి క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించి జోనల్ స్థాయి క్రీడా పోటీలను విజయంతం చేయాలని రాష్ట్ర గురుకులాల ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ అలుగు వర్షిని సూచించారు. బాన్సువాడ మండలం బోర్లం సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కొనసాగుతున్న జోనల్‌స్థాయి క్రీడా పోటీలను ఆమె మంగళవారం పరిశీలించారు. క్రీడాకారిణులకు ఏర్పాటు చేసిన వసతి సౌకర్యాలపై జోనల్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పద్మకుమారిని అడిగి తెలుసుకున్నారు. చదువుతోపాటు క్రీడలకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నదని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులతో కలిసి వాలీబాల్ ఆడి ఉత్సాహం నింపారు. జోనల్‌లోని 15 గురుకుల పాఠశాలలకు చెందిన 1,270 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, హ్యాండ్‌బాల్, టెన్నికాయిట్, చెస్, క్యారమ్స్, అథ్లెటిక్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీలు ఉత్కంఠ భరితంగా కొనసాగాయని జోనల్ అధికారిణి ప్రత్యూష తెలిపారు. కార్యక్రమంలో డీసీవో నాగేశ్వర్‌రావు, ప్రిన్సిపాల్ రమాదేవి, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ

మాచారెడ్డి, నవంబర్ 12 : మండలంలోని ఘన్‌పూర్ జడ్పీ హెచ్ఎస్‌ను డీఈవో రాజు మంగళవారం తనిఖీ చేశారు. స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కలర్ పార్టీ ద్వారా స్వాగతం పలికారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించిన అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ ఘన్‌పూర్ విద్యార్థులు డైమండ్ జూబ్లీ సెలబ్రేషన్‌లో ఉన్నత స్థానం సాధించినందుకు ప్రశంసించారు. ఆయన వెంట మాచారెడ్డి ఎంఈవో దేవేందర్‌రావు, కామారెడ్డి ఎంఈవో ఎల్లయ్య, డిప్యూటీ డీఈవో బలరాంనాయక్, పీజీహెచ్ఎంలు రాజేశ్వర్‌రెడ్డి, వెంకటాచారి, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్కాట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులతో డీఈవో, ఉపాధ్యాయులు

చెక్కుల అందజేత

చెక్కులను అందజేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

బాన్సువాడ, నవంబర్ 12 : పట్టణంలోని శాంతి నగర్, బీడీ వర్కర్స్ కాలనీలోని లబ్ధిదారులకు బాన్సువాడలోని పోచారం స్వగృహంలో సుమారు 27 లక్షల రూపాయల చెక్కులను వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గంగాధర్, కౌన్సిలర్ కిరణ్‌కుమార్, మాజీ సర్పంచ్ శ్రావణ్‌కుమార్, జలపతి రెడ్డి, ఉదయ్‌గుప్తా తదితరులు ఉన్నారు.

మహిళ మృతదేహం లభ్యం

బాన్సువాడ, నవంబర్ 12 : బాన్సువాడలోని కల్కి చెరువు వద్ద మంగళవారం ఉదయం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభించిందని పట్టణ ఎస్‌హెచ్‌వో అశోక్ తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్కి చెరువు వద్ద గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని సమాచారం వచ్చిందన్నారు. చెరువులో నుంచి మృతదేహాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. మృతురాలి వయస్సు సుమారు 40, 45 ఏండ్ల వరకు ఉంటుందని, ఎరుపు రంగు చీర, నలుపు రంగు జాకెట్ ధరించి ఉందని తెలిపారు. మృతురాలి ముఖంపై గాయాలు ఉండడంతో ఎవరో మహిళను దారుణంగా హత్య చేసి, చెరువులో పడివేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మహిళను గుర్తించిన వారు 8712686167కు సమాచారం అందించాలని ఎస్‌హెచ్‌వో అశోక్ సూచించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

కామారెడ్డి పెద్దచెరువులో..

కామారెడ్డి రూరల్, నవంబర్ 12 : కామారెడ్డిలోని పెద్ద చెరువులో ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం కనిపించిందని స్థానికులు సమాచారం ఇచ్చారని దేవునిపల్లి పోలీసులు తెలిపారు. ఘటనా స్థలానికి చేరుకున్న దేవునిపల్లి పోలీసులు మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి వయస్సు 25 నుంచి 30 ఏండ్లు ఉంటుందని తెలిపారు. మెడలో నల్లపూసల దండ, చేతికి ఇంగ్లిష్‌లో రాజు, మూడు స్టార్ గుర్తులు ఉన్న పచ్చబొట్టు ఉందని తెలిపారు. వివరాలు తెలిస్తే కామారెడ్డి రూరల్ సీఐ 8712686148, దేవునిపల్లి ఎస్సై 8712686150 నంబర్లను లేదా పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

కొనసాగుతున్న త్రయాహ్నిక ఉత్సవాలు

విఠలేశ్వర మందిరంలో మంగళహారతులిస్తున్న మహిళలు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: పట్టణంలోని విఠలేశ్వర మందిరంలో ఆలయ ధర్మకర్త వంగపల్లి నాగభూషణం గుప్తా, ఆలయపూజారి ప్రణయ్ జ్యోషిల ఆధ్వర్యంలో త్రయాహ్నిక ఉత్సవాలు రెండో రోజూ కొనసాగాయి. ఏకాదశి తిథిననుసరించి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టినట్లు ఆలయ పూజారి అన్నారు. ఉదయం కాకడ హారతి, భక్తులతో అభిషేక కార్యక్రమాలు, అలంకరణ, మహామంగళహారతి, తీర్థప్రసాద వితరణ, మధ్యాహ్నం అభిషేకాలు, సామూహిక కుంకుమార్చన, విష్ణు సహస్ర నామ పారాయణం, మంగళహారతి, రాత్రి సమయంలో ఉపచారపూజలు, వేదస్వస్తి కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

తుంకిపల్లి చెరువులో చేప పిల్లల విడుదల

చెరువులో చేప పిల్లలు విడుదల చేస్తున్న నాయకులు

నిజాంసాగర్, నవంబర్ 12 : మహ్మద్‌నగర్ మండలం తుంకిపల్లి గ్రామ చెరువులో చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగభూషణం గౌడ్, ఖాలిక్, కృష్ణ, అంజయ్య, గణేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన

నిజాంసాగర్, నవంబర్ 12 : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ రోహిత్ కుమార్ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలపై మంగళవారం ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు.

సెల్‌ఫోన్ వివరాలను ఉంచుకోవాలి

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: ప్రతివ్యక్తీ తన సెల్‌ఫోన్ వివరాలను దగ్గర ఉంచుకోవాలని ఎస్సై బొజ్జ మహేశ్ అన్నారు. మంగళవారం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా బాధితుడికి సెల్‌ఫోన్ అందజేశారు. 2023 డిసెంబర్ 6న ఎల్లారెడ్డిలో ఫోన్ పోగొట్టుకున్నట్లు బాధితుడు పురం రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయి గ్రామంలో మంగళవారం ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించి, దానిని బాధితుడికి అందజేసినట్లు ఆయన వివరించారు.

'మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్‌కు ఇవ్వొద్దు'

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: సుప్రీంకోర్టు ఆదేశాలననుసరించి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించ వద్దని మధ్యాహ్న భోజన పథక వర్కర్స్ యూనియన్ సభ్యులు కోరారు. మంగళవారం ఎల్లారెడ్డి తహసీల్దార్ అల్లం మహేందర్‌కు వారు వినతిపత్రం సమర్పించారు.

వికటించిన 'పీఎంపీ' వైద్యం

- పూర్తిగా దెబ్బతిన్న మహిళ ఆరోగ్యం
- అనారోగ్యంతో ఊడిన తాత్కాలిక ఉద్యోగం
- పీఎంపీని కఠినంగా శిక్షించాలని కోరుతున్న ప్రజలు

ఎటువంటి బోర్డూ లేకుండా ప్రాక్టీస్ చేస్తున్న పీఎంపీ

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: అనుమతులు లేకుండానే పీఎంపీల పేరుతో సూదిమందులు ఇస్తూ, సెలైన్‌లు ఎక్కిస్తూ.. విచ్చలవిడిగా వైద్యం చేస్తూ ప్రజల ప్రాణాల మీదికి తెస్తున్నారు. నొప్పులు ఉన్నాయని పట్టణానికి చెందిన ఓ మహిళ ఒక పీఎంపీ వద్దకు వెళ్లగా ఆయన నొప్పులు తగ్గిస్తానని ఆరు నెలల పాటు ఆమెకు స్టెరాయిడ్‌తో కూడిన సూదిమందులు, పెయిన్‌కిల్లర్ ఇచ్చి వైద్యం చేసి ఆమెను పూర్తిగా అనారోగ్యం పాలు చేసిన వైనం వెలుగులోకి వచ్చింది. పట్టణంలోని మెప్మా కార్యాలయంలో తాత్కాలిక ఆర్పీగా పని చేస్తున్న స్వర్ణలత అనే బాధిత మహిళ చెప్పిన ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీలో ఎటువంటి బోర్డూ లేకుండా పీఎంపీ పేరుతో వైద్యం చేస్తున్న రవీందర్ అనే వ్యక్తి వద్దకు నొప్పులు ఉన్నాయని వైద్యం కోసం సదరు మహిళ వెళ్లింది. పీఎంపీ ఆరునెలలుగా ఆమెకు స్టెరాయిడ్‌తో కూడిన ఇంజెక్షన్లు ఇచ్చాడు. అయినా నొప్పులు తగ్గకపోగా ఆమె శరీరంపై బుగ్గలు రావడం, మంటలు, నొప్పులు అధికమై పరిస్థితి విషమంగా మారింది. దీంతో స్వర్ణలత హైదరాబాద్‌కు చికిత్స నిమిత్తం వెళ్లింది. అక్కడ పీఎంపీ చేసిన వైద్యం వివరాలు తెలుసుకున్న వైద్యులు అతను ఇచ్చిన సూది మందు వల్లే సమస్య తీవ్రమైందని తెలిపారు. ట్రీట్‌మెంట్ చేస్తాం కానీ, ప్రాణానికి గ్యారంటీ ఇవ్వబోమని తెలుపగా గాబరాపడ్డ ఆమె దిక్కుతోచక తప్పని పరిస్థితిలో వైద్యం చేయించుకోవడానికి మూడు దవాఖానల చుట్టూ తిరిగింది. రూ. లక్షలు ఖర్చయినా ఇంకా తన ఆరోగ్య పరిస్థితి మెరుగుపడలేదు. తన ఆరోగ్య పరిస్థితి పూర్తిగా అధ్వానమైందని, తన పనులు తాను చేసుకోలేకపోవడంతో మెప్మాలో తన ఉద్యోగాన్ని కూడా తీసివేశారని స్వర్ణలత భోరున విలపించింది. తనకు న్యాయం చేసి తన జీవితాన్ని కాపాడాలని ఆమె కోరింది. ఈ విషయమై పీఎంపీ రవీందర్‌తో మాట్లాడగా.. మీకు ఇంజెక్షన్లు, సెలైన్లు ఇవ్వడానికి అనుమతులు ఉన్నాయా అని ప్రశ్నించగా లేదు అని రవీందర్ సమాధానమిచ్చాడు. ఎటువంటి అనుమతులు లేకుండా ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్న పీఎంపీలను కఠినంగా శిక్షించి న్యాయం చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి తప్పులూ లేకుండా సర్వే చేయాలి

మద్నూర్‌లో కులగణన సర్వేను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

మద్నూర్, నవంబర్ 12: మండలకేంద్రంలో మంగళవారం కులగణన సర్వేను బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి పరిశీలించారు. సర్వే తీరును పరిశీలించి ఎలాంటి తప్పులు లేకుండా చేయాలని, అన్ని వివరాలు పొందుపర్చాలని సూచించారు. సబ్‌కలెక్టర్‌వెంట డీఎల్పీవో నాగరాజు, తహసీల్దార్ ముజీబ్, ఎంపీడీవో రాణి, గ్రామ కార్యదర్శి సందీప్‌కుమార్ ఉన్నారు.

పారదర్శకంగా వివరాలను నమోదు చేయండి..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: ఎన్యుమరేటర్లు పారదర్శకంగా సర్వే వివరాలను నమోదు చేయాలని ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు సూచించారు. ఆయన మండలంలోని అన్నాసాగర్, రుద్రారం, జంగమాయిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. ఎన్యుమరేటర్లు ప్రశ్నలు అడుగుతున్న విధానం, ప్రజలు సమాధానాలు చెబుతున్న విధానాన్ని ఆయన ప్రత్యక్షంగా చూశారు. ఎన్యుమరేటర్లకు ప్రజలు సహకరించాలని కోరారు. ఆయనతో పాటు తహసీల్దా ర్ మహేందర్, ఎంపీడీవో ప్రకాశ్, మున్సిపల్ మాజీ చైర్మన్ సత్యనారాయణ, నాయకులు, తదితరులున్నారు.

ప్రతి ఇంటి నుంచి వివరాలు సేకరించాలి..

లింగంపేట, నవంబర్ 12: ప్రతి ఇంటికి తిరిగి వివరాలు సేకరించాలని డీఆర్‌డీవో సురేందర్ సూచించారు. మండలంలోని శెట్పల్లి, శెట్పల్లిసంగారెడ్డి, మాలపాటి గ్రామాల్లో నిర్వహిస్తున్న సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయన వెంట ఆయా గ్రామాల కార్యదర్శులు, సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు ఉన్నారు.

స్వచ్ఛందంగా వివరాలు తెలపాలి..

కామారెడ్డి, నవంబర్ 12 : జిల్లా కేంద్రంలోని 19, 20వ వార్డుల్లో మంగళవారం నిర్వహించిన సర్వేను మున్సిపల్ చైర్పర్సన్ ఇందూప్రియ పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కమిషనర్ వేణుగోపాల్, కౌన్సిలర్లు, నాయకులు, సర్వే సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లు పాల్గొన్నారు.

సర్వే పరిశీలన..

రాజంపేట్, నవంబర్ 12 : మండలంలో చేపడుతున్న సర్వేను డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ మంగళవారం పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారిణి అపర్ణ, ఎంపీవో రఘురాం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

లింగంపేట, నవంబర్12: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సూచించారు. మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలను రెండో విడతలో మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కోరినట్లు తెలిపారు. పాఠశాల ఏర్పాటుకు మండలంలోని మోతె గ్రామ శివారులో స్థలం పరిశీలించినట్లు వెల్లడించారు. అనంతరం పోల్కంపేట గ్రామంలో నూతనంగా నిర్మించిన పల్లెదవాఖానాను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేశ్, తహసీల్దార్ నరేందర్‌గౌడ్, ఎంఈవో హిమబిందు, మండల పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మెన్ రజిత వెంకట్రాంరెడ్డి, వైస్ చైర్మన్ రాజు, మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకటాములు, తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ పనులు పరిశీలించిన ఎమ్మెల్యే..

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: పట్టణంలోని బస్టాండ్‌లో జరుగుతున్న పనులను ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు పరిశీలించారు. నిధులు లేక అర్ధంతరంగా నిలిచిన పనులు ఇటీవలే తిరిగి ప్రారంభమయ్యాయి. అనంతరం ఆయన వంద పడకల దవాఖాన పనులను పరిశీలించారు. ఆయనతో పాటు నాయకులు సత్యనారాయణ, సాయిబాబా, గోపి, గఫర్, వినోద్‌గౌడ్ ఉన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై మోహన్‌రెడ్డి

బిచ్కుంద, నవంబర్ 12: మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు మంగళవారం ఎస్సై మోహన్ రెడ్డి ఓపెన్ హౌస్ నిర్వహించారు. విద్యార్థులకు పోలీసుల విధులు, ఫిర్యాదుదారులు స్టేషన్‌కు వచ్చినప్పుడు వారితో ఏవిధంగా మాట్లాడుతారనే విషయాలను వివరించారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 12: పట్టణంలోని 10వ వార్డులో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని సూచించారు.

లిఫ్ట్ అడిగి.. బైక్ చోరీ

బిచ్కుంద, నవంబర్12 : లిఫ్ట్ అడిగిన వ్యక్తి బైక్‌ను తీసుకొని పారిపోయిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై మోహన్ రెడ్డి కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దెగ్లూర్ గ్రామం నుంచి మత్తు దేవర గుండాయప్ప బస్వరాజ్ తన బైక్ ఎంహెచ్20డీజెడ్9459 పై బిచ్కుందకు వస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మిర్జాపూర్ గ్రామం వద్ద ఆపి బిచ్కుంద వరకు వస్తానని లిఫ్ట్ అడిగాడు. సదరు వ్యక్తిని బైక్‌పై ఎక్కించుకొని బస్వరాజ్ బిచ్కుందకు వస్తుండగా రాజుల్లా గ్రామ సమీపంలో ఇటుక బట్టీ వద్ద మూత్ర విసర్జనకు బైకును నిలిపాడు. తిరిగివచ్చే సరికి గుర్తు తెలియని వ్యక్తి బైకును తీసుకొని పారి పోయాడు. బాధితుడు బిచ్కుంద పోలీస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఎస్సై సీసీ పుటేజీని పరిశీలించి బైక్ తీసుకొని పారిపోయిన వ్యక్తిని గుర్తించారు. సదరు వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే బిచ్కుంద పోలీస్టేషన్‌లో 8712686176, 8712686175 సంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.

అనుమతి లేకుండా మొరం తరలిస్తే కఠిన చర్యలు

బిచ్కుంద, నవంబర్ 12 : మండలంలోని పథలాపూర్ గ్రామ శివారు నుంచి అనుమతి లేకుండా మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు మంగళవారం రెండు టిప్పర్లను బిచ్కుంద పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. పథలాపూర్ గ్రామ శివారునుంచి మొరం తరలిస్తున్నారన్న సమాచారం మేరకు పథలాపూర్, కందర్‌పల్లి గ్రామాల మధ్య అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకొని బిచ్కుంద తహసీల్దార్‌కు అప్పజెప్పామన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనం స్వాధీనం

బిచ్కుంద, నవంబర్ 12 : మండలంలోని షెట్లూర్ గ్రామ మంజీర పరీవాహక ప్రాంతం నుంచి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు బిచ్కుంద పోలీసులు షెట్లూర్ శివారులో ఇసుక తరలిస్తున్న బొలేరో వాహనాన్ని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్సై మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఎవరైనా ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు బస్సీ అర్జున్

గాంధారి, నవంబర్ 12: రాష్ట్రస్థాయి అథ్లెటిక్ పోటీలకు మండలంలోని పేట్ సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి బస్సీ అర్జున్ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి జిల్లాల అథ్లెటిక్ ఎంపిక పోటీల్లో, అండర్-14 విభాగంలో పాల్గొన్న అర్జున్ డిస్కస్‌త్రోలో మొదటి, లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. త్వరలో ఖమ్మం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడన్నారు. ఈ సందర్భంగా అర్జున్‌ను పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా రేణుకా ఎల్లమ్మ కల్యాణం

రామారెడ్డి, నవంబర్12 : సదాశివనగర్ మండలం భూంపల్లి గ్రామంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ విగ్రహానికి గౌడ కులస్తులు మంగళవారం కొమురవెల్లి ఒగ్గు బృందం వారితో కల్యాణం నిర్వహించారు. అనంతరం అమ్మవారికి ఏడు అంతస్తుల బోనంతో పాటు మహిళలు బోనాలు తీసి నైవేద్యం సమర్పించారు.

తేమశాతాన్ని పరిశీలించి తూకం వేయాలి

ఎల్ల